హనుమకొండ పద్మాక్షి గుండం వద్దకు వినాయకుడిని నిమజ్జనం కోసం తీసుకువస్తున్న భక్తులు

పరకాల : చలివాగులో వినాయక నిమజ్జనాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత-రామకృష్ణ

ఎల్కతుర్తి: వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న భక్తులు

గంగమ్మ ఒడికి గణనాథుడు

- అంబరాన్నంటిన నిమజ్జన వేడుకలు
- కనులపండువలా శోభాయాత్రలు
- డప్పుచప్పుళ్లు, చిన్నాపెద్దల నృత్యాలు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు

తొమ్మిది రోజుల పాటు విశేష పూజలందుకున్న గణనాయకుడికి జిల్లావాసులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో వినాయక విగ్రహాలను ఉంచి కనుల పండువలా శోభాయాత్రలు తీశారు. దారి పొడవునా డప్పు చప్పుళ్లు, నృత్యాలు, విన్యాసాలతో చిన్నాపెద్దా కేరింతలు కొట్టారు. గణనాథులకు ఉత్సవ సమితి నిర్వాహకులు ప్రత్యేక పూజలు చేశారు. వాడవాడలా ప్రతిష్ఠించిన ప్రతిమలను అందంగా అలంకరించిన వాహనాల్లో తరలించారు. వరంగల్ త్రినగరిలోని 22 చెరువుల్లో, పరకాల పట్టణ శివారులోని చలివాగు, ఊరుగొండ పెద్దచెరువు, రంగనాయకుల చెరువు, దామెరలోని గిద్దెచెరువు, ధర్మసాగర్ రిజర్వాయర్, కటాక్షపురం పెద్ద చెరువు, పత్తిపాక చలివాగు బ్రిడ్జి, శాయంపేట దేవునిచెరువు, కాజీపేట సోమిడి చెరువు, హసన్‌పర్తి పెద్దచెరువు, బంధం చెరువులో గణనాథులను నిమజ్జనం చేశారు. 'జై బోలో గణేశ్ మహరాజ్‌కీ.. గణపతి బప్పా మోరియా..' అంటూ నినదిస్తూ గంగమ్మ ఒడికి సాగనంపారు. రాత్రి 10గంటల వరకు సిద్ధేశ్వర, పద్మాక్షి గుండాల్లో 275 విగ్రహాలను నిమజ్జనం చేశారు. - నమస్తే నెట్‌వర్క్, సెప్టెంబర్ 16

హనుమకొండ చౌరస్తా : వేయిస్తంభాల ఆలయ కోనేరులో గణపతికి త్రిశూల స్నానం చేయిస్తున్న గంగు ఉపేంద్రశర్మ


హనుమకొండ : స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో వినాయక నిమజ్జన పూజలో పాల్గొన్న అనితారెడ్డి


హనుమకొండ పద్మాక్షి గుండంలో వినాయకుడి నిమజ్జనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

భీమదేవరపల్లి : గణనాథుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

ఐనవోలు : నిమజ్జనానికి ట్రాక్టర్‌లో తరలుతున్న వినాయక విగ్రహం

ఆత్మకూరు : కటాక్షపురం చెరువులో..


హసన్‌పర్తి : చెరువు వద్ద క్రేన్‌లో గణేశుడితో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, సిబ్బంది

పద్మాక్షి గుండంలో క్రేన్‌తో వినాయకుడి నిమజ్జనం

ధర్మసాగర్ : ధర్మసాగర్ రిజర్వాయర్‌లో..

ఐనవోలు: మండల కేంద్రంలోని గణపతి హోమంలో పాల్గొన్న ఈవో నాగేశ్వర్‌రావు-వసంత దంపతులు

కాజీపేట బంధంచెరువు వద్ద వినాయకుడితో భక్తులు

కమలాపూర్ : వినాయకుడిని కోలాటాలతో ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

ఎల్కతుర్తి : దామెరలో వేలంలో దక్కించుకున్న లడ్డూతో కొమురారెడ్డి, ఆలయ నిర్వాహకులు

దామెర : వినాయకుడిని నిమజ్జనానికి తీసుకెళ్తున్న 'డిస్నీల్యాండ్' విద్యార్థులు

శాయంపేట : గణపతిని నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు

గణనాథుడి లక్కీడ్రాలో లడ్డూ గెలుచుకున్న మామిండ్ల రాజ్‌కుమార్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా పాలన దినోత్సవం

హనుమకొండ, సెప్టెంబర్ 16 : కలెక్టరేట్‌లో మంగళవారం ప్రజాపాలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారన్నారు. మంత్రి మంగళవారం ఉదయం 9.48 గంటలకు అదాలత్ కూడలిలో అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారని, 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకొని జాతీయ జెండా ఎగురవేస్తారని, 10.05 గంటలకు మంత్రి ప్రసంగిస్తారని పేర్కొన్నారు. సీపీ అంబర్ కిశోర్ ఝా పాల్గొంటారని తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్‌ను వెంటనే మార్చాలి

వేలేరు, సెప్టెంబర్ 16 : ప్రభుత్వం నియమించిన ఎస్సీ వర్గీకరణ కమిటీ చైర్మన్‌గా ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని తొలగించి ఎస్సీ వర్గానికి చెందిన నాయకులను నియమించాలని బీఆర్ఎస్ నాయకుడు కొయ్యడ మహేందర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్గీకరణ విషయంలో మాదిగలను కాంగ్రెస్ పార్టీ మరోసారి మోసం చేస్తున్నదని విమర్శించారు. ఎస్సీ వర్గానికి చెందిన నాయకులను వర్గీకరణ కమిటీ చైర్మన్‌గా నియమించకపోవడం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కుట్ర అని అన్నారు.

నూతన రచయితలకు నవలల పోటీలు

పోచమ్మమైదాన్, సెప్టెంబర్ 16: కొత్తగా నవలలు రాస్తున్న రచయితలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ వరంగల్ ఆధ్వర్యంలో నవలల పోటీలను నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ కార్యదర్శి డీ స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమంగా ఉన్న మొదటి నవలకు ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేల పారితోషికాన్ని డిసెంబర్ 24న ప్రముఖ రచయిత అంపశయ్య నవీన్ పుట్టిన రోజు వేడుకల్లో ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. రచయితలు తాము రాసిన నవలలను డీటీపీ చేయించి రెండు ప్రతులను అక్టోబర్ 31లోగా డీ స్వప్న, ఇంటి నంబర్ 2-7-71, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ చిరునామాకు పంపాలని, ఇతర వివరాలకు సెల్ నంబర్ 9989291299 సంప్రదించాలని ఆమె సూచించారు.

పశు వైద్యశాలకు ప్రహరీ నిర్మించాలి

ఆత్మకూరులో ప్రహరీ లేని పశువైద్యశాల

ఆత్మకూరు, సెప్టెంబర్ 16 : మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రానికి ప్రహరీ లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వైద్యాధికారులు తెలిపారు. పశువులను అదుపు చేయలేకపోతున్నామన్నారు. ఇటీవల పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆత్మకూరుకు వచ్చినప్పుడు ప్రహరీ నిర్మించాలని వినతిపత్రం అందజేసినట్లు పశువైద్యాధికారి ధర్మానాయక్ తెలిపారు. ఎమ్మెల్యే చొరవ తీసుకొని గోడ నిర్మాణానికి నిధులు కేటాయించాలని పశువుల పెంపకందారులు కోరుతున్నారు.

ఉద్యోగం రావడం లేదని ఆత్మహత్య

సందీప్ (ఫైల్)

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 16 : మండలంలోని గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన ముక్క సందీప్ (24) ఉద్యోగం రాకపోవడం, ఆర్థిక సమస్యలతో జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్కతుర్తి ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సందీప్ ఘట్‌కేసర్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఎంబీఏ పూర్తి చేసి ఉద్యోగం కోసం వెతుకుతున్నాడు. తన తండ్రి స్వామి ఆరోగ్యం బాగాలేకపోవడంతో పలు ఆస్పత్రుల్లో వైద్యం చేయిస్తున్నాడు. ఉద్యోగం రాకపోవడం, ఆర్థిక పరిస్థితులు దిగజారడంతో ఈ నెల 6న మండలంలోని శాంతినగర్ సబ్‌స్టేషన్ వద్ద పురుగుల మందు తాగాడు. సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు అక్కడికి చేరుకొని అతడిని చికిత్స కోసం హుజూరాబాద్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హనుమకొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆదివారం రాత్రి మృతిచెందాడు. తల్లి రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా బెల్ట్ షాపులు

- గణేశ్ నిమజ్జనం వేళ గ్రామాల్లో ఏరులై పారిన మద్యం
- దృష్టి పెట్టని ఎక్సైజ్ శాఖ

ఎల్కతుర్తి, సెప్టెంబర్ 16 : గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో వైన్ షాప్‌లను బంద్ పెట్టించిన పోలీసు, ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపులను మరిచినట్లున్నారు. సోమవారం బెల్ట్‌షాపుల్లో మద్యం ఏరులై పారింది. వైన్‌షాపులు బంద్ అవుతాయనే ఉద్దేశంతో బెల్ట్‌షాపుల నిర్వాహకులు వేలాది రూపాయల విలువైన మద్యం కొనుగోలు చేసి మద్యంప్రియులకు అమ్ముతూ సొమ్ము చేసుకున్నారు. సాయం త్రం ఒక్కో మద్యం సీసాపై అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తున్నది. వైన్‌షాపులు తెరిచి ఉన్న రోజుల్లోనే ఒక్కో క్వార్టర్‌పై అదనంగా రూ.50 తీసుకుంటున్న బెల్ట్‌షాపు నిర్వాహకులు కొన్ని గ్రామాల్లో మరో రూ.20 నుంచి 30 వరకు అదనంగా తీసుకున్నట్లు సమాచారం. అటు మందుబాబుల జేబులకు చిల్లు లు పడగా, బెల్ట్‌షాపుల నిర్వాహకుల గల్లాపెట్టెలు మాత్రం నిండాయి. బెల్ట్‌షాపుల నియంత్రణపై ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారనే విమర్శలున్నాయి.

పతకాలు సాధించిన పరకాల విద్యార్థులు

కరాటే పోటీల్లో విద్యార్థులకు పతకాలు

పరకాల, సెప్టెంబర్ 16 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పరకాలకు చెందిన పలువురు విద్యార్థులు మెడల్స్ సాధించినట్లు క్రియేటివ్ కరాటే డూ క్లబ్ వ్యవస్థాపకుడు మాడ సంపత్ తెలిపారు. కరీంనగర్‌లోని అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్ షిప్‌లో సబ్ జూనియర్ బాలుర స్పారింగ్ విభాగంలో బుర్ర ఉమామహేశ్వర్, జూనియర్ బాలుర విభాగంలో తేజ, సీనియర్ విభాగంలో ఆదిత్య బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. బాలికల సబ్ జూనియర్ విభాగంలో బుర్ర ఆరాధ్య బంగారు, లక్కం అమూల్య కాంస్య పతకాలను సాధించారు. ఆయా విద్యార్థులను కాయ్ తెలంగాణ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నరేందర్, కోశాధికారి సాయికుమార్, రెఫరీ కమిషన్ చైర్మన్ పాపయ్య అభినందించారు.

నలుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

శాయంపేట, సెప్టెంబర్ 16 : నలుగురు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పత్తిపాక శివారులో పేకాట శిబిరంపై ఆదివారం రాత్రి పోలీస్ సిబ్బందితో దాడి చేశారు. గణేశ్, మధు, రాజు, కిరణ్‌ను అరెస్ట్ చేయగా, శ్రీకాంత్, మహేశ్, సాయిరాం, వినోద్ పారిపోయినట్లు తెలిపారు. వీరి నుంచి రూ.890 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED HOSPITAL STAFF

jobs Apply Now!

★LAB TECHNICIANS-BOYS,
★PHARMACY BOYS (మందుల షాపు)
★OT BOYS కావలెను. సంప్ర : Guardian Hospital, Mulugu 'X' Road, Warangal. 12 to 2 PM.
NTW-0427

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మహమ్మద్ ప్రవక్త మార్గం అనుసరించాలి

బియాబానీ దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా

కాజీపేట, సెప్టెంబర్ 16 : మహమ్మద్ ప్రవక్త సూచించిన మంచి మార్గాన్ని అనుసరించాలని హజరత్ సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా సూచించారు. సోమవారం దర్గాలో మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. దర్గాలో మహ్మద్ ప్రవక్త తల వెంట్రుకలు, దుస్తులు తదితర వస్తువులను ప్రదర్శనకు పెట్టడంతో ముస్లింలు ప్రార్థనలు చేసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప పీఠాధిపతి భక్తియార్ బియాబానీ, మున్సూర్ బియాబానీ, అజీజ్ బేగ్, మహమూద్, బబ్లూ పాల్గొన్నారు.

దర్గాలో మహమ్మద్ ప్రవక్త వస్తువుల వద్ద మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి ఖుస్రుపాషా

సైన్స్ సెంటర్‌లో ఓజోన్ డే వేడుకలు

హనుమకొండ, సెప్టెంబర్ 16 : ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా సోమవారం హంటర్ రోడ్డులోని రీజినల్ సైన్స్ సెంటర్‌లో తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక విద్యా మండలి (టీజీ కాస్ట్) ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ జిల్లాలకు చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. సైన్స్ సెంటర్ ఫీల్డ్ అసిస్టెంట్ సాయిని అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పెరుగు శ్యామ్ హాజరయ్యారు. ఓజోన్ పొర పరిరక్షణపైన విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఓజోన్ పొర ఎలా మానవాళికి దోహదపడుతుంది.. మానవ చర్యలు ఏవిధంగా ఓజోన్ పొరను క్షీణింపజేస్తున్నాయి.. ఈ నష్టాన్ని అరికట్టకపోతే జరిగే పరిణామాలు.. మనం తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. వరంగల్ జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ అందరి జీవనశైలి పర్యావరణ హితంగా ఉండాలన్నారు. సైన్స్ సెంటర్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఈర్ల రాకేశ్ మాట్లాడుతూ.. తెలంగాణ శాస్త్ర సాంకేతిక విద్యా మండలి సహకారంతో రీజినల్ సైన్ సెంటర్ నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరిస్తూ ప్రతి విద్యార్థి సైన్స్ పట్ల మక్కువ పెంచుకొని వారి సృజనాత్మక ఆలోచనలతోనే పరిశోధనాత్మక విలువలను పెంపొందించాలని సూచించారు. తెలంగాణలోని ఏకైక సైన్స్ సెంటర్‌గా వరంగల్లో ఉన్న కేంద్రాన్ని ప్రతి విద్యార్థి సందర్శించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. న్యాయనిర్ణేతలుగా సురేశ్‌బాబు, కృష్ణారెడ్డి, శ్రవణ్, పరమేశ్వర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు సీనియర్ అసోసియేట్ కీర్తి వివేక్, రిసోర్స్ పర్సన్ నాగమణి, రాజయ్య, విద్యార్థులు, గైడ్ టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

అక్రమ క్రషర్లపై కఠిన చర్యలు!

- రూ.112 కోట్లకు నోటీసులు
- డిసెంబర్ వరకు ఎన్నికల్లేవ్.. స్పెషలాఫీసర్లే కీలకం
- సమీక్షలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

సమీక్షలోమాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట, సెప్టెంబర్ 16 : మండలంలో అక్రమ క్రషర్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని, డిసెంబర్ వరకు స్థానిక ఎన్నికలు జరగవని గ్రామ ప్రత్యేకాధికారులే కీలకమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శాయంపేట మండల పరిషత్‌లో గ్రామ స్పెషలాఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. కోతులు, కుక్కల బెడద తీర్చేందుకు ప్రభుత్వం డబ్బులు ఇవ్వదని, పది ఇరవై వేలు ఇల్లీగల్ పనులు చేస్తున్న బెల్ట్‌షాపులు, క్రషర్లు, ఇతరత్రా వాటి నుంచి సమకూర్చుకోవాలన్నారు. చెరువు కట్ట, రోడ్లు మరమ్మతులకు నిధులను ఇస్తానన్నారు. కొత్తగట్టుసింగారం, మాందారిపేట, ప్రగతిసింగారం, పత్తిపాక గ్రామాల పరిధిలో గుట్టల్లో పేలుళ్లతో ఇండ్లు నేలకూలుతున్నాయన్నారు. వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను ప్రజాప్రతినిధులు కబ్జా చేశారన్నారు. ఇల్లీగల్‌గా క్రషర్లు నడిపిస్తున్న నిర్వాహకులకు రూ.112 కోట్లకు నోటీసులు ఇచ్చారన్నారు. ఒకరికి రూ.79 కోట్లకు పంపించామన్నారు. అరూరి రమేశ్ భార్య పేరుపై ఉన్న క్రషర్‌ను సీజ్ చేయించామన్నారు. డబ్బు కట్టకపోతే మిగిలిన అన్ని క్రషర్లను సీజ్ చేయిస్తామన్నారు. గుట్టలపై సెస్సు వసూలు చేయాలన్నారు. ఎఫ్‌డీఆర్ కింద హనుమకొండ జిల్లాకు రూ.2కోట్లకుపైగా నిధులు వచ్చాయని వాటిని రాబట్టుకోవాలన్నారు. గంగిరేణిగూడెంలో గుడుంబా తయారు కాకుండా పోలీసులు, ఎంపీడీవో చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం 13 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీవో రమాకాంత్, డీడబ్ల్యూవో రాజమణి, ఎంపీడీవో ఫణిచంద్ర, తహసీల్దార్ సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్ పాల్గొన్నారు.

లక్కీడ్రాలో శునకానికి దక్కిన గణపతి లడ్డూ

లక్కీడ్రాలో శునకం గెలుపొందిన గణనాథుడి లడ్డూ

హనుమకొండ చౌరస్తా, సెప్టెంబర్ 16 : గణపతి నవరాత్రుల లడ్డూల ఖ్కీడ్రాలో ఒక శునకం(కుక్క) పేరుతో దాని యజమానికి లడ్డూ ప్రసాదం దక్కింది. కేయూ రోడ్‌లోని డబ్బాలు వద్ద హనుమాన్ గజానన మండలి ఆధ్వర్యంలో గణేశ్ నవరాత్రులను నిర్వహించారు. సోమవారం నిర్వహించిన లడ్డూ లక్కీ డ్రాలో పోలాస రాజేశ్-వాణి కుటుంబ సభ్యులు పెంచుకుంటున్న శునకం(సోని) పేరు వచ్చింది. ఇంట్లో అందరి పేరుతో డ్రా వేయగా అదృష్టం మాత్రం శునకానికి వరించడం విశేషం.